సాక్షి
జనగామ
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



బైక్.. భద్రం బ్రదరూ!
ట్రిసిటీలో ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ఆస్పత్రులు, రెస్టారెంట్లు, రద్దీ ప్రాంతాల్లో ఎక్కువగా వాహన చోరీలు జరుగుతున్నాయి.
- 6లో▸



నిరంతర అధ్యయనం జరగాలి
దౌత్య సంబంధాలపై నిరంతరం అధ్యయనం జరగాలని పీవీ నర్సింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభివాణిదేవి అన్నారు.
- 6లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34°/24°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామికి శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికోసం చేయించిన 170 గ్రాముల వెండి యజ్ఞోపవేతాన్ని యాదగిరిగుట్టకు చెందిన భక్తులు కలకోట వాసవి–శ్రీకాంతాచార్యులు ఈఓ లక్ష్మీప్రసన్నకు అందజేశారు. చిన్నపెండ్యాలకు చెందిన విజయగిరి భవాని–అంకయ్య, అనుప్రియ–అజయ్ అన్నప్రసాదం సమకూర్చారు. ధర్మకర్తలు కుంచాల సంపత్‌రాజు, జంగిటి కుమార్, వేల్పుల గట్టయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 166 మంది గైర్హాజరు

జనగామ రూరల్: కేంద్రీయ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి శనివారం జిల్లాలో నిర్వహించిన పరీక్షకు 166 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల జిల్లా ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చేర్యాల, స్టేషన్‌ఘన్‌పూర్, జిల్లాకేంద్రంలోని జనగామ, ధర్మకంచ పాఠశాలలు, చౌడారం మోడల్ స్కూల్, కొడకండ్ల ప్రభుత్వ పాఠశాల సెంటర్లలో జరిగిన ఈ పరీక్షకు 1,038 మంది విద్యార్థులకు 972 హాజరయ్యారని పేర్కొన్నారు.

నేడు పట్టణంలో మోడల్ ఎంసెట్ టెస్ట్

జనగామ రూరల్: మోడల్ ఎంసెట్ పరీక్ష ఆదివారం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు రిటైర్ట్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీవీ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఈ టెస్ట్ ఉంటుందని, ఎంసెట్, నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేర్యాలలో కోర్టు ఏర్పాటు చేయాలి



జనగామ రూరల్: గతంలో నియోజకవర్గంగా ఉన్న చేర్యాలలో కోర్టు ఏర్పాటు చేయాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్‌రెడ్డి మంత్రి హరీశ్‌రావును కోరారు. ఈ మేరకు శనివారం ముస్త్యాల బాలనర్సయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మనోహర్, రవీందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న షర్మిలకు ధన్యవాదాలు



లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట రోడ్డు పటేల్‌గూడెం సమీప గుడిసెవాసులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.15 లక్షలతో సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిలకు శనివారం ప్రజలు అభినందనలు తెలిపారు. జనగామ నుంచి కురవి వెళ్తున్న ఆమె గుడిసెవాసుల విజ్ఞప్తి మేరకు కొద్దిసేపు ఆగగా.. వారు ధన్యవాదాలు తెలిపారు. సుమారు 800 మంది గుడిసెవాసులు చీకట్లో ఉంటున్న విషయాన్ని ఇటీవల పాదయాత్ర సందర్భంగా తెలుసుకుని సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామని షర్మిల హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

మార్కెట్ సూపర్‌వైజర్ సస్పెన్షన్

కొడకండ్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వి.నాగార్జున్‌ను సస్పెండ్ చేసినట్లు మార్కెట్ చైర్మన్ పేరం రాము ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ కార్యదర్శి ఎస్.నిరంజన్‌పై శుక్రవారం సూపర్‌వైజర్ నాగార్జున్ దూషించి భౌతికదాడి చేసినట్లు బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ విచారణ చేపట్టినట్లు చెప్పారు. గతంలో మార్కెట్ కార్యాలయంలో చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారుల నివేదిక ఆధారంగా మార్కెట్ సూపర్‌వైజర్ నాగార్జున్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు వివరించారు.

వెంటాడిన వరుణుడు

ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం

- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- మూడు మండలాల్లో తీవ్ర నష్టం
- లబోదిబోమంటున్న రైతన్నలు



లింగాలఘణపురం : సబ్‌మార్కెట్ యార్డులో..



స్టేషన్‌ఘన్‌పూర్ : సముద్రాల గ్రామంలో కొట్టుకుపోయిన ధాన్యం కుప్ప వద్ద రైతు కె.రాజు



జఫర్‌గఢ్ : తడిసిన ధాన్యం వద్ద రైతులు

జఫర్‌గఢ్/లింగాలఘణపురం/స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల వరుసగా నాలుగు రోజుల పాటు వడగళ్లతో బీభత్సం సృష్టించిన వరుణుడు శనివారం ఉదయం మళ్లీ విజృంభించాడు. జిల్లాలోని జఫర్‌గఢ్, లింగాలఘణపురం, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కల్లాల వద్ద ఆరబోసిన, కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యపు గింజలు నీటిలో కొట్టుకు పోయాయి. ఉదయం ఆకాశంలో మబ్బులు కమ్ముకుని ఉరుములు రావడంతో పలువురు రైతులు ధాన్యం కుప్పలపై పరదాలు కప్పుకున్నారు. అయినా వర్షం ధాటికి పరదాలు కొట్టుకుపోయాయి. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని విశ్వనాథపురం, ఇప్పగూడెం, సముద్రాల, కోమటిగూడెం, రంగరాయగూడెం, అక్కపెల్లిగూడెం తదితర గ్రామాల్లో ధాన్యం పూర్తిగా తడిసింది. లింగాలఘణపురం సబ్‌మార్కెట్ యార్డు కొనుగోలు కేంద్రంలోని ధాన్యపు రాశుల పైనుంచి వర్షపు నీరు ప్రవహించడంతో గింజలు నీటిలో కొట్టుకు పోయాయి. నీటిని తొలగించేందుకు, తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడ్డారు. ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోయిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. సబ్‌మార్కెట్ సీసీ చేయడానికి మంజూరైన రూ.3 కోట్లతో పనులు వెంటనే చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

ప్రతి మండల కేంద్రంలో పోలీస్ గ్రీవెన్స్

- మధ్యాహ్నం పీఎస్‌లో అందుబాటులో ఉండాలి
- పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు వారానికి ఒకరోజు మండల కేంద్రాల్లో పోలీస్ గ్రీవెన్స్ నిర్వహిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. శనివారం నిట్ కళాశాలలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిర్యాదు చేయడానికి ప్రజలు సుదూర ప్రాంతాలనుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్ రావడానికి ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని వారానికి ఒక రోజు మండల కేంద్రంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామని ప్రకటించారు. సెంట్రల్ జోన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌హెచ్‌ఓలు తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్న బెల్ట్‌షాపులపై దృష్టి సారించాలని సూచించారు. తప్పుడు కేసులు నమోదు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఫిర్యాదులపై దర్యాప్తునకు డీసీపీలు, ఏసీపీలు సైతం క్షేత్ర స్థాయిలో పర్యటించాలని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయానికి మొదటి మెట్టు పోలీస్‌స్టేషన్ అన్న విషయాన్ని పోలీసులు గుర్తించుకోవాలని అన్నారు. మధ్యాహ్నం సమయంలో అధికారులు స్టేషన్‌లో అందుబాటులో ఉండాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించే వారిని సహించేది లేదని, సమయపాలన పాటించాలన్నారు. ఫిర్యాదులకు పోలీస్ స్టేషన్‌లో రశీదులు అందజేయాలని తెలిపారు. సమావేశంలో డీసీపీలు మురళీధర్, అబ్దుల్‌బారీ, కరుణాకర్, అదనపు డీసీపీలు పుష్పారెడ్డి, ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం సిబ్బందికి ప్రశంసపత్రాలు

సైబర్ విభాగంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రశంసపత్రాలు అందజేశారు. ప్రశంసలు అందుకున్న వారిలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రెడ్డి, ఏఎస్‌ఐలు ప్రశాంత్, సల్మాన్‌పాషా, హెడ్ కానిస్టేబుళ్లు అన్వర్‌పాషా, రవీందర్, సురేష్‌గౌడ్, రాజు, కిషోర్ ఉన్నారు.

కల్యాణలక్ష్మితో తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా..

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల ఆడ పిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించడానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం జనగామ మండలం, అర్బన్‌కు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రెండు మండలాల పరిధిలో ఇప్పటి వరకు రూ.23 కోట్ల విలువైన చెక్కులను అందించామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ ప్రజాసంక్షేమానికి కృషి చేస్తుంటే.. ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, ఎంపీపీ మేకల కలింగరాజు, ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు కర్రె శ్రీనివాస్, బండ పద్మయాదగిరిరెడ్డి, మారబోయిన పాండు, సర్పంచ్ శారద, అంబాల ఆంజనేయులు, సుజాత, బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ పాల్గొన్నారు.



సోమేశ్వరాలయాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎండోమెంట్ ఆడిట్ విభాగం డైరెక్టర్ వెంకటేశ్వరరావు



ఆలయంలో వెంకటేశ్వరరావుతో ఇతర అధికారులు

పాలకుర్తిటౌన్: చారిత్రక విశిష్టత కలిగిన పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని ఎండోమెంట్ రాష్ట్ర ఆడిట్ విభాగం డైరెక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆలయాన్ని ఆయన సందర్శించగా ఈఓ బి.లక్ష్మీప్రసన్న, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడు తూ.. దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డీడీలు రేవతి, రాము, ఆడిట్ డీఈఓ నిశాంతి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు సర్కారు కృషి

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘణపురం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. శనివారం మండలంలోని పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పటేల్‌గూడెం వరకు రూ.15 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లను సీసీ చేయడంతోపాటు మారుమూల ప్రాంతాలకు బీటీ రోడ్లు వేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి పాటుపడుతున్నారని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులను, ప్రజాప్రతినిధులను కోరారు. సర్పంచ్ పెండ్లి దేవేంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, ఎంపీటీసీ సిద్దు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాసు, నాగేందర్, రాజు, ఆంజనేయులు, ఆనందర్, శ్రీనివాస్, విష్ణు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమానికి సన్నద్ధం కావాలి

- ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్

జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధన మలిదశ ఉద్యమానికి జాతి సన్నద్ధం కావాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ సైసా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ సామాజిక వర్గం చేయని విధంగా మాదిగలు 30 ఏళ్ల నుంచి వర్గీకరణకు పోరాడుతున్నారని, పాలకులు ఇచ్చిన మాటకు కట్టుబడకపోవడంతో వర్గీకరణ బిల్లు కావడం లేదన్నారు. నాయకులు గ్రామాలకు వెళ్లి ప్రజలకు పాలకుల మోసాలను వివరిస్తూ ఉద్యమాన్ని క్షేత్ర స్థాయిలో పునర్నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, ఎడవెల్లి సోమశేఖర్, చుంచు రాజు, శ్యంసన్, జేరిపోతుల సుధాకర్, నీర్మాల భాస్కర్, కోడిదేటి కుమార్, కిషోర్, రవి, నాగరాజు పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

- ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలి
- వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల



ఆలింపూర్‌లో వడగళ్లతో నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న వైఎస్ షర్మిల

బచ్చన్నపేట : అకాల వర్షాలతో పంటలు నష్టపోయి అన్నదాతలు ఆగమవుతుంటే వారి గోడు పట్టించుకోకుండా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. శనివారం మండల పరిధి ఆలింపూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాలలో పర్యటించిన ఆమె వడగళ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించారు. మామిడి తోటలతోపాటు వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బచ్చన్నపేట మండలంలో వడగళ్ల వాన కారణంగా 20వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగిందని, అయినా సీఎం కేసీఆర్ స్పందించడం లేదన్నారు. హెలికాప్టర్‌లలో తిరుగుతూ.. ఏసీల్లో ఉంటే రైతుల గోస ఏమి తెలుస్తుందని ఎద్దేవా చేశారు. గడిచిన తొమ్మిదేళ్లలో రూ.14వేల కోట్ల విలువైన పంట నష్టం జరిగితే.. ముష్టి 'రైతుబంధు' ఇచ్చి అన్నదాతలను ఉద్ధరించినట్లు ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కిసాన్ సర్కార్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. పంటలను నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్కారు స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు షర్మిలకు తమ గోడు వెళ్లబోసుకోగా ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ జనగామ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గౌరబోయిన సమ్మయ్య, యూత్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, స్టేషన్‌ఘన్‌పూర్ కోఆర్డినేటర్ సంగాల ఇరువయ్య, వగలబోయిన శ్రీకాంత్‌గౌడ్, శ్రీధర్, అఖిల్, శ్రీను, రమేష్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం

- అన్నదాతలు ఆందోళన చెందొద్దు
- చివరి గింజ వరకూ ధాన్యం కొంటాం
- సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

జనగామ: ఇటీవల కురిసిన వడగళ్లతో పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం పరిహారం అందిస్తుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అకాల వర్షాలు, పంటల నష్టం, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ శివలింగయ్య, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, అదనపు కలెక్టర్, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు నష్టపోకుండా సర్వే చేపట్టి పరిహారం చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. దెబ్బతిన్న పంటల వివరాలను సర్వే ద్వారా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, చివరి గింజ వరకూ మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కేంద్రాల్లోని ధాన్యాన్ని రవాణా చేయడానికి వాహనాలు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. మక్కలను సైతం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, గుర్తించిన కేంద్రాల్లో ఏర్పాట్లు చేయడంతోపాటు ఈ విషయాన్ని రైతులకు తెలిసేలా ప్రచారం చేయాలని ఆదేశించారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలో వడగళ్ల వానతో 44,166 ఎకరాల్లో వరి, 430 ఎకరాల్లో మొక్కజొన్న, 93 ఎకరాల్లో కూరగాయ పంటలు, 3,297 ఎకరాల్లో మామిడి తోటలు ధ్వంసమయ్యాయని చెప్పారు. అలాగే పశువుల ప్రాణ నష్టం, 19 గృహాలు కూలిపోయాయని, ఇందుకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేయడానికి ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయి సర్వే చేస్తున్నట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ పంటలు నష్టపోయిన కౌలు రైతులకు కూడా పరిహారం వస్తుందని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, డీఆర్డీఓ రాంరెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, డీఏఓ వినోద్‌కుమార్, సీపీఓ ఇస్మాయిల్, డీఎస్ఓ రోజారాణి, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కొన్నెలో పురాతన రాగి కడియం లభ్యం



పురాతన రాగి కడియం

బచ్చన్నపేట: మండల పరిధి కొన్నె గ్రామంలోని గజగిరి గుట్ట వద్ద పురాతన రాగి కడియం లభించినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గజగిరి గుట్ట వద్ద చాలా రోజుల నుంచి పరిశోధనలు చేస్తుండగా.. గతంలో ఆదిమానవులు నివాసమున్నట్లు పలు ఆనవాళ్లు లభించాయని చెప్పారు. ఇప్పుడు పాటిగడ్డపై సుమారు 5 అడుగుల లోతులో రాగితో తయారు చేసిన 9 ఇంచుల పొడవు, 66 గ్రాముల 850 మిల్లీ గ్రాముల బరువు, 1.5 సెంటీ మీటర్ల చుట్టు కొలత కలిగిన కడియం లాంటి ఆభరణం లభించినదన్నారు. ఇది వేల ఏళ్లగా మట్టి పొరల్లో ఉండడం వల్ల దానిపై ఆకుపచ్చ పూత ఏర్పడిందని వివరించారు. ఇక్కడ పురావస్తు అధికారులు తవ్వకాలు చేపడితే విలువైన చారిత్రక ఆధారాలు లభిస్తాయని అన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరిస్తా..

చిల్పూరు: మండల పరిధి శ్రీపతిపల్లిలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. విగ్రహ ప్రతిష్ఠాన కమిటీ బాధ్యులు శనివారం హనుమకొండలో కడియంను కలిసి ఈ మేరకు కోరారు. కొయ్యడ రాందాసు, గడ్డం సిద్ధయ్య, రాజేందర్, బాబు, రాజయ్య, మహేందర్, నర్సయ్య, వెంకటయ్య, సిద్దిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓదారుస్తూ.. పలకరిస్తూ..



నర్మెట: పాదయాత్రలో భట్టి, పొన్నాల



కేక్ కట్ చేస్తున్న భట్టివిక్రమార్క, పొన్నాల లక్ష్మయ్య

- జోరువానలో 'భట్టి' పాదయాత్ర
- రెండోరోజు హన్మంతాపూర్‌లో ప్రారంభమైన 'పీపుల్స్‌మార్చ్'
- కొర్రతండాలో 500 కిలోమీటర్లకు చేరిన యాత్ర
- పొన్నాలతో కలిసి కేక్ కట్ చేసిన భట్టివిక్రమార్క

జనగామ: వడగళ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను ఓదారుస్తూ.. ప్రజలను పలకరించి సమస్యలు తెలుసుకుంటూ.. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ముందుకుసాగారు. ఆయన చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర శనివారం రెండో రోజు నర్మెట మండలం బొమ్మకూరు–హన్మంతాపూర్‌లో నిర్వహించారు. వర్షంలోనే టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యతో కలిసి పాదయాత్ర చేపట్టారు. అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారు. హన్మంతాపూర్ శివారు పొలాల వద్ద రైతులను పలకరించగా.. వడగళ్లతో జరిగిన నష్టాన్ని అన్నదాతలు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయి పడుతున్న కష్టాలను పలువురు రైతులు చెప్పుకున్నారు. ఈ క్రమంలో పొలంలోకి దిగిన భట్టి.. రాలిన గింజలను చూసి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. 'మాకు సొంత ఇళ్లు లేవు.. గోడలు, పైకప్పులపై టార్పాలిన్ కవర్లు కప్పుకుని జీవిస్తున్నాం.. ఇళ్లు, పింఛన్ ఇప్పించాలి' అని ఇరుగు లక్ష్మి, ఎల్లవ్వ, సుశీల, ఎల్లమ్మ వేడుకోగా.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంజూరు చేస్తామని సీఎల్పీ నేత హామీ ఇచ్చారు. అనంతరం పాదయాత్ర జనగామ మండలం అడివికేశ్వాపూర్, ఎర్రగొల్ల పహాడ్ స్టేజీ వద్దకు చేరుకున్నాక.. స్థానిక ప్రజలను పలకరిస్తూ ఇబ్బందులు తెలుసుకున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని, మద్దతు ధరతో కొనుగోలు చేస్తేనే మా బతుకులు బాగుపడుతాయని.. మీవంతు సహకారం ఉండాలని వేడుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఉంటుందని, న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. కొర్రతండా, గోవింద్‌తండా, మరిగడి–గానుగుపహాడ్ స్టేజీ, వడ్లకొండ.. అక్కడి నుంచి జనగామ పట్టణానికి చేరుకుంది. గిర్నిగడ్డ ఓల్డ్ ఆంధ్రాబ్యాంకు, హెడ్ పోస్టాఫీస్, మున్సిపల్ ఏరియా, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ఫ్లైఓవర్, నెహ్రూపార్కు, ఆర్టీసీ చౌరస్తా వరకు సాగింది. నెహ్రూపార్కు నుంచి ఒగ్గుడోలు కళాకారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆర్టీసీ చౌరస్తాలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. ఇదిలా ఉండగా.. మార్చి 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం పిప్పిరి గ్రామం నుంచి మొదలైన పాదయాత్ర 43వ రోజు జనగామ జిల్లాలో 502.5 కిలోమీటర్లు పూర్తయింది. కొర్రతండాలో పొన్నాలతో కలిసి భట్టి విక్రమార్క కేక్‌కట్ చేశారు. పాదయాత్రలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణరాజేశ్వరరావు, ధర్మసంతోష్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్, లోకుంట్ల ప్రవీణ్, గిరికొండల్‌రెడ్డి, బడికె ఇందిర, పి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర వ్యాపార మోసాలపై విచారణ చేపట్టాలి



షాప్‌లో అమ్ముతున్న నకిలీ పోచంపల్లి చేనేత చీరను చూపిస్తున్న దాసు సురేశ్

నయీంనగర్: చేనేత వస్త్రాలంటూ మిల్లు వస్త్రాలపై నేసిన చీరలను అమ్ముతున్న వస్త్ర వ్యాపార సంస్థల మోసాలపై సీబీఐ విచారణ చేపట్టాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సురేశ్ మాట్లాడుతూ.. నగరంలోని ఓ మాల్ చేనేత చీరలకు బదులు మోసపూరితంగా మిల్లు వస్త్రాలు అమ్ముతూ అధికారులకు దొరకిపోయిందన్నారు. అనేక ఆఫర్లతో మహిళలను మోసగిస్తూ, ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని నగర ప్రజలు గమనించాలన్నారు. కొనుగోలుదారులు చేనేత వస్త్రాలు అసలువో, నకిలీవో సరిచూసుకోవాలని కోరారు. చేనేత కార్మికుల సంక్షేమార్థం కొనసాగుతున్న ఈ పోరాటంలో దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదని సురేశ్ హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఆడేపు నగేశ్, పాదిల రాజు, మడత కిషోర్, పాదిల సాయిబాబా, అన్నరాజు, బగ్గిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రమేశ్, ఆచార్యులు

కేయూ క్యాంపస్: కేయూలోని బయోటెక్నాలజీ విభాగం, యునైటెడ్ కింగ్‌డమ్ లోవెల్స్‌లోని అబెర్యస్త్వత్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 27 నుంచి 28వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈమేరకు శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైన్స్ డీన్ పి.మల్లారెడ్డి, విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాస్ అడ్జంట్ ఆచార్యులు ఎ.సదానందం, ఆచార్య ఎస్.రాంరెడ్డి, ఆచార్య ఎన్.రామస్వామి, అధ్యాపకులు డాక్టర్ టి.శాస్త్రి, డాక్టర్ రాధిక, డాక్టర్ మహేందర్, డాక్టర్ రజనీకాంత్, భకత్, ఫణికాంత్ విశ్రాంత ఆచార్యులు పి.కృష్ణమాచార్య, క్రిస్టోఫర్, వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బైక్.. భద్రం బ్రదరూ!

- రెక్కీ వేసి.. క్షణాల్లో చోరీ
- ఈజీ మనీ కోసం కొందరి తప్పదారి
- బైక్‌పోతే రికవరీ కష్టం
- కనీస జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు

ఈనెల 28న వరంగల్ 39వ డివిజన్ లక్ష్మినగర్‌కు చెందిన కుల్ల నాగరాజు ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. నాగరాజు గురువారం రాత్రి బైక్‌ను పార్క్ చేసి నిద్రకు ఉపక్రమించాడు. శుక్రవారం తెల్లవారు జామున లేచి చూసే సరికి కనిపించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై షాపులు, ఇళ్ల ఎదుట నిలిపిన వాహనాలు

ఖిలా వరంగల్: నగరంలోని రద్దీ మార్గాలు, శివారు కాలనీల్లో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ఆస్పత్రులు, రెస్టారెంట్లు, రద్దీ ప్రాంతాల్లో ఎక్కువగా వాహన చోరీలు జరుగుతున్నాయి. మద్యానికి బానిసైన యువత పార్క్ చేసి ఉంచిన బైక్, ఆటో, కారును రెప్పపాటులో మాయం చేస్తున్నారు. ఈఘటనలు వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌తోపాటు వరంగల్ ట్రైసిటీవ్యాప్తంగా కొన్నాళ్లుగా ఎక్కువగా జరుగుతున్నాయి. రహదారుల మీద, ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు అనేకం మాయమవుతున్నాయి. రాత్రి వేళల్లో ఇంటి ఎదుట నిలిపి తర్వాతి రోజు ఉదయం చూసే సరికే వాహనాలు కనిపించట్లేదు. కాగా దొంగలు ఎత్తుకెళ్లిన ద్విచక్రవాహనాలు మధ్యతరగతి వారివే. ప్రస్తుతం బైక్ కొనాలంటే రూ.లక్షకు పైగా వెచ్చించాల్సి వస్తోందని వారంతా వాపోతున్నారు.

పట్టపగలే మాయం..

నగర రహదారులకు ఇరువైపులా పార్క్ చేసి షాపుల్లోకి వెళ్లడం, ఇంటి ఎదుట పార్కు చేసి ఇళ్లలోకి వెళ్తుంటారు. తిరిగి వచ్చి చూసే సరికి బైక్ కనిపించదు. ఇటీవల వరంగల్ తూర్పు, శివనగర్, కరీమాబాద్, ఫోర్ట్ రోడ్డు, చింతల్, శాంతినగర్, మిల్స్ కాలనీ, తెలంగాణ జంక్షన్ రహదారులపై ద్విచక్ర వాహనాలు ఎక్కువగా మాయమవుతున్నాయి. వరంగల్ ట్రైసిటీకి గ్రామీణ ప్రాంత ప్రజలతోపాటు నగర ప్రజల వివిధ అవసరాల కోసం షాపింగ్‌కు వస్తుంటారు. రహదారులపై వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. ఇటీవలి కాలంలో రద్దీగా ఉండే ప్రాంతాలను దొంగలు ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు.

ఖరీదైన బైక్‌లపై కన్ను..

కొందరు యువత వ్యసనాలకు బానిసై, ఈజీ మనీకి అలవాటై బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. పగలంతా రెక్కీ వేసి రాత్రిళ్లు పార్క్ చేసిన బైక్‌లను ఎత్తుకెళ్తున్నారు. యువకులు ఎంతో ఇష్టంగా కొంటున్న స్పోర్ట్స్, ఇతర బ్రాండ్ కంపెనీల బైక్‌లపై దొంగలు కన్నేస్తున్నారు. వాటిని చోరీ చేసి వేరే వాళ్లకు విక్రయిస్తూ, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ.. చోరీ చేసిన వాహనాన్ని విడిభాగాలను రాత్రికి రాత్రే స్క్రాప్‌కు అమ్మేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. ఇంటి ఎదుట వాహనం నిలపాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. పోలీసుల గస్తీ తక్కువగా ఉండడంతోనే దొంగలు చెలరేగుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

వాహనం పోయిన తర్వాత పోలీసులను ఆశ్రయించడం కంటే ఎవరికి వారు జాగ్రత్తలు పాటించాలి. వాహనానికి ఉండే తాళంతో పాటు చక్రాలకూ తాళాలు వేస్తే కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. తాళం పడిందో లేదో ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలి. రోజుల తరబడి వాహనాన్ని వదిలేసి ఉంచకూడదు. ముఖ్యంగా ఇంటి ఎదుట వాహనం పార్కింగ్ చేస్తే కనీస జాగ్రత్తలు తీసుకోవాలి. దీనిపై మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. బైక్ దొంగలను గుర్తించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీల్లో నిఘా పెంచామని, షాపులు, ఇళ్ల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

వాహన రికవరీలేవి?

వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి వాహనాలు మాయమైన కేసుల దర్యాప్తులో రోజులు గడుస్తున్నా పురోగతి ఉండడం లేదని బాధితులు వాపోతున్నారు. మరో వైపు ముఖ్యమైన కేసులు దర్యాప్తులు, బందోబస్తు, కార్యక్రమాలంటూ పోలీసులకు విధులు ఉండడంతో చిన్నపాటి కేసులు దర్యాప్తు ముందు సాగని పరిస్థితి నెలకొంది. ఈస్టేషన్ నిత్యం రద్దీగా ఉండడంతో వాహన చోరీ కేసులను ఛేదించలేకపోతున్నట్లు తెలుస్తోంది.

కొన్ని చోరీలు ఇలా..

- వరంగల్ శివనగర్ పల్లవి ఆస్పత్రి లేన్‌లో నివాసం ఉండే ఓవ్యక్తి ఇటీవల ఒక రోజు సాయంత్రం ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌కు లాక్ చేసి ఇంట్లో నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం చూసే సరికే ఖరీదైన బైక్ కనిపించలేదు. చేతిలో బైక్ లేక ఉపాధి కోల్పవడంతో కన్నీరుమున్నీరయ్యాడు.
- వరంగల్ చింతల్ మైసమ్మ గుడి ప్రాంతానికి చెందిన ఎండి.హైమద్ ఈనెల 19న వరంగల్ రైల్వే స్టేషన్ శివనగర్‌వైపు బైక్ నిలిపి, రైల్వేస్టేషన్ క్యాంటీన్‌కు వెళ్లి కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూడగా.. వాహనం కనిపించలేదు. లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.
- కరీమాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి అదే ప్రాంతంలో బంధువుల ఇంటి ఎదుట పార్కింగ్ చేసి పైఅంతస్తుకు వెళ్లి కొద్దిసేపటి తర్వాత కిందికి వచ్చి చూడగా బైక్ మాయమైంది.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్‌ఆర్ విజయకేతనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎస్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు

హన్మకొండ చౌరస్తా: దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ(మెయిన్)–23 ప్రవేశానికి శనివారం వెలువడిన ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులతో సత్తా చాటి విజయకేతనం ఎగురవేశారని ఎస్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ కాకాజీ కాలనీలోని ఎస్‌ఆర్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫలితాల వివరాలు వెల్లడించారు. తమ విద్యార్థులు బి.సమీత్ జాతీయ స్థాయిలో రిజర్వేషన్ కేటగిరీలో 7వ ర్యాంకు, సాత్విక్ 20వ ర్యాంకు, చవాన్ అఖిల 22వ ర్యాంకు, శ్రీవర్షిత్ 34వ ర్యాంకు, కొడారి కార్తీక్ 44, ధరావత్ సాయిధీరజ్ 48, బానోత్ చరణ్ 92, బానోత్ నితీశ్ 109, షేక్ అబ్దుల్ సమీర్ 118, పృథ్వీరాజ్ తేజావత్ 167, బి.హార్దిక్ 167, సి.సోనిక 203, ఎండి.మొయినొద్దీన్ 215, నవీన్‌కుమార్ 232, పెండెం శ్రీకరి 322, మణిదీప్‌రెడ్డి 324, పి.నర్మద 357 ర్యాంకులను సాధించారని హర్షం వ్యక్తం చేశారు. వీరితోపాటు జేఈఈ అడ్వాన్స్‌డ్–2023కు ఇప్పటి వరకు 2,786కి పైగా ప్రవేశానికి విద్యార్థులు అర్హత సాధించి ఎస్‌ఆర్ కీర్తి ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరింత అత్యుత్తమైన మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యా బోధన, ఉన్నతమైన ఫ్యాకల్టీతో ఈ విజయాలను సాధించగలిగామన్నారు. ఈసమావేశంలో ఎస్‌ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐపీఎస్ అవుతా..



జాతీయ స్థాయిలో 7వ ర్యాంకు సాధించడం నా కెరీర్‌లో ఓ మైలురాయి. ఇదే స్ఫూర్తితో సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించి ఐపీఎస్ కావడమే లక్ష్యం. సింగిల్ డిజిట్ ర్యాంక్ రావడం వెనకాల ఉపాధ్యాయులైన మా అమ్మా నాన్నలు రాములు, అరుణ ప్రోత్సాహం మరువలేనిది.

– సమీత్, పైడిపెల్లి

ఫేస్‌బుక్ సీఈఓ అవడమే లక్ష్యం



జేఈఈ మెయిన్ ఫలితాల్లో 20వ ర్యాంకు రావడం వెనుక మా అధ్యాపకుల బోధన, మాకు నేర్పిన క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసమే కారణం. ఎస్‌ఆర్ కాలేజీ నేర్పించిన పట్టుదల, విద్యతో భవిష్యత్‌లో ఫేస్‌బుక్ సీఈఓ కావడమే లక్ష్యంగా సాఫ్ట్‌వేర్‌పై పట్టు, నైపుణ్యాలపై శిక్షణ తీసుకుంటా.

– సాత్విక్, వికాస్‌నగర్

ఐటీ రంగంలో రాణిస్తా..



జేఈఈ (మెయిన్) ఫలితాల్లో 357వ ర్యాంకు సాధించడం మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. మా అధ్యాపకుల బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించా. ఐటీ రంగంలో రాణించడమే లక్ష్యంగా చదువు కొనసాగిస్తా.

– నర్మద, వడ్డెపల్లి

కృష్ణవేణి జయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణవేణి యజమాన్యం, సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్–2 ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపుడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని కళాశాలలో శనివారం వారు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. తమ విద్యార్థులు బి.అరవింద్ 54, టి.నేహా శ్రీ 186, ఎస్.కే.సుభానీ 280, టి.జనేషు 367, ఎస్.వెంకట సాయితేజ 472, టి.పవన్ 823, డి.మనోజ్ 897, పి.రవిశంకర్ 1,201, బి.కల్యాణ్ 1,357, బి.కిరణ్ 1,535, బి.బాబా 1,596, జె.సోని 1,957, నిఖిల శ్రీ 2,197, ఆర్.చంటి 2,229, బి.యశ్వంత 2,864, కె.అనుశ్రీ 3,143, బి.అమిత 3257, బి.మహేశ్ 3,363, జి.చైతన్య 3,365, పి.అస్మిత 3,593, బి.తులసి ప్రియ 3,614, బి.శివ రామకృష్ణ 4,149, జి.దేవేందర్, 4,187, బి.కార్తీక్ 4,502, సిరిబాయి 4,556, జి.సిద్ధు 4,851 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, అకాడమిక్ డీన్ శేఖర్‌బాబు, ఇన్‌చార్జ్ వంశీకృష్ణ, ఏఓ నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడి మృతి



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో బుధవారం తాటిచెట్టు పైనుంచి కింద పడిన గీత కార్మికుడు గట్టు భిక్షపతి(35) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన భిక్షపతి మృతితో కుటుంబం ఆధారం కోల్పోయింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని కుటుంబానికి ఆర్థిక చేయూతనందించాలని కమలాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు పాలకుర్తి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బుడిగ అశోక్, గ్రామస్తులు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.







జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'రెజోనెన్స్' ప్రతిభ




ర్యాంకులు సాధించిన విద్యార్థులతో రెజోనెన్స్ విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్లు

హన్మకొండ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తాజాగా ప్రకటించిన జేఈఈ మెయిన్స్–23 రెండో సెషన్ ఫలితాల్లో హనుమకొండలోని రెజోనెన్స్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. తమ విద్యా సంస్థల విద్యార్థులు ఎప్పటిలాగే.. ఈసారి కూడా మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. జి.రామకృష్ణ, 99.99 పర్సంటైల్‌తో 115వ ర్యాంకు, జి. అభిషేక్ 99.98 పర్సంటైల్‌తో 258, ఏ.కావ్య 99 97 పర్సంటైల్‌తో 378, ఎస్.అపూర్వ 99, 97 పర్సంటైల్‌తో 390, జి. క్రితిన్ 99, 97 పర్సంటైల్‌తో 407, యం.నిహాల్ 99.81 పర్సంటైల్‌తో 415, అర్జున్ కృష్ణ 99.96 పర్సంటైల్‌తో 465, యాదా అక్షయ్ 99, 60 పర్సంటైల్‌తో 580, పి.అరవింద్ 97.78 పర్సంటైల్‌తో 911వ ర్యాంకు సాధించినట్లు రెజోనెన్స్ విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని రెజోనెన్స్ కాలేజీలో అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఈఓ మునీందర్ ఇరుకుళ్ల, అకాడమిక్ డీన్ బీఎస్.గోపాలరావు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనం జరగాలి

- ఎమ్మెల్సీ సురభివాణిదేవి



భవనాన్ని పరిశీలిసున్న ఎమ్మెల్సీ సురభివాణిదేవి, పక్కన వీసీ

కేయూ క్యాంపస్: పీవీ రాజనీతి, తాత్విక చింతన, ఆర్థిక సంస్కరణలు, దౌత్య సంబంధాలపై నిరంతరం అధ్యయనం జరగాలని భారత మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభివాణిదేవి అన్నారు. శనివారం ఆమె కాకతీయ యూనివర్సిటీని సందర్శించారు. వీసీ రమేశ్‌తో పలు అంశాలపై ముచ్చటించారు. పీవీ జీవిత చరిత్ర, రాజకీయ జీవితం ఇతర అంశాలతోపాటు క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు పీవీ అమలు చేసిన వ్యూహాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. వీసీ రమేశ్ ఎమ్మెల్సీ సురభి వాణిని సత్కరించి జ్ఞాపిక, పూల బొకేను అందించారు.

ఆ భవనంలోనే పీవీ విజ్ఞాన పీఠం!

కేయూలో రెండో గేట్ సమీపంలో అడ్మిషన్ల డైరెక్టరేట్ కార్యాలయం కోసం రూ.1.60 కోట్లతో నిర్మించిన నూతన భవనంలోనే పీవీ విజ్ఞాన పీఠాన్ని కేయూ వీసీ తాటికొండ రమేశ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు శనివారం ఎమ్మెల్సీ సురభివాణిదేవి, వీసీ ఈ భవనాన్ని పరిశీలించారు.

వైద్య విద్యార్థులకు బయోమెట్రిక్ తిప్పలు



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన సేవల కోసం రాష్ట్రంలో మొదటి సారి కేఎంసీకి అనుబంధంగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యవిద్యార్థుల కోసం బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. బయోమెట్రిక్ పరికరాన్ని పరిపాలన కార్యాలయంలోని బహిరంగ ప్రదేశంలో కాకుండా.. గతంలో ఏఓగా విధులు నిర్వర్తించిన ప్రత్యేక చాంబర్‌లో అమర్చారు. శనివారం ఉదయం 10:30 తర్వాత సైతం ఈచాంబర్ గది తాళం తీయకపోవడంతో క్లినికల్ విధులు నిర్వర్తించిన వైద్య విద్యార్థులు తమ బయోమెట్రిక్ విధానాన్ని నమోదు చేసేందుకు ఎదురుచూశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

- Caliber Education' Online English Communication Skills classes for all age groups. For details Contact 9390006358. [HA-29439]

గృహిణిలకు ఉద్యోగ వార్త..!

- వేసవిలో గిటార్ సంస్థ (Sponsored by SETWIN, Govt. of Telangana) వారి ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సు (PPTTC) కు హాజరై ట్రైనింగ్, సర్టిఫికేట్, ఉద్యోగం పొందండి. బ్యాచ్ May 3rd to May 9th, HNK Ph: 9876591800, 7382733795, Limited Seats available. [W-785492]

REAL ESTATE

LEASE / RENT

- అంబాలా to HNK హైవే రోడ్డుకు E/F 70ft (3) 230 (ఫా) కాంపౌండ్ గోడ, 1840 sq.yds (15 గుంటలు) (16x16) 2 రూంలు, (16x45) ft రేకుల షెడ్, 2 అటాచ్డ్ రూంలు, బోర్ అన్ని వసతులు 100% వాస్తు రెస్టారెంట్‌కు అనుకూలం. 9182922080. [WA-12886]

FLAT FOR SALE

- KUDA కాలనీ, 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26953]
- వరంగల్, హనుమకొండ, భీమారం సీతారామ అంజనేయ స్వామి గుడి దగ్గరలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి నివాస్ నందు 2BHK FLATS అమ్మకానికి కలవు. Good Ventilation, Ready to Occupy సంప్ర॥ 9849101554. [WA-2951]

HOUSE FOR SALE

- ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26954]
- వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26955]
- ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26956]

PLOT FOR SALE

- WGL, నాయుడు పెట్రోల్ పంప్ వరంగల్–తొర్రూర్ మెయిన్ రోడ్డుకి 275 చ॥గ॥ గల North-East కమర్షియల్ ప్లాట్ అమ్మబడును. నో బ్రోకర్స్. సంప్ర॥ 9491061034 [W-785496]

- ఎక్సైజ్ కాలనీ నందు 5Cరోడ్‌లో రాజీవ్ పార్క్‌కు అతి సమీపమున 290 చ॥గ॥ల (43 1/2x 60) ఖాళీ స్థలము వెస్ట్ మరియు సౌత్ రోడ్డు గలది అమ్మబడును. సంప్రదించుటకు: 8106033277. [W-1110367]
- దుర్గాదేవి కాలనీ రోడ్ నెంబర్. 3, హంటర్ రోడ్‌లో 271 చ॥గ॥ల నార్త్ ఫేసింగ్ 40x61 తో కూడిన ఫుల్ LRS గల ప్లాటు అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8341368328, 9059973792. [WA-2952]
- హన్మకొండ, గోపాల్‌పూర్ కల్లు మండువ దగ్గరలో విద్యాధరి స్కూల్ ప్రక్కన EAST ఫేసింగ్ 110 ఫీట్లు మెయిన్ రోడ్డుకు సెకండ్ బిట్ గల 1000 చ॥గ॥ల ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ 9849101554. [WA-2953]

LAND FOR SALE

- Commercial Land for Sale. 155 Sq.Yards, Main Road, Kazipet, Opp. Bus Stand. Interested Parties Contact: 95029 92505, 98496 63525 [M-9432]

TO-LET

- HNK-KUC 100 Ft. రోడ్డు, TNGO's కాలనీ, వెంకటేశ్వర స్వామి గుడి ఎదురుగా నూతనంగా నిర్మించిన Lift, CC కెమెరాలు, ఫర్నీచర్‌తో సహా 2 & 3 BHK ఇల్లులు అద్దెకు కలవు. 94409 07910. [M-9435]

SERVICES

- స్కూల్‌కు పనికి వచ్చే సెకండ్ హాండ్ డ్యూయల్ డెస్కులు అమ్మబడును. సంప్ర॥ 9866637169. [WA-16414]
- హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ ఋణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL. 9618767116 [W-785487]
- అన్ని రకాల వ్యాపార ఋణాలు, ఆస్తిపై ఋణాలు, ఇన్సూరెన్సులు, ఓపెన్ ప్లాట్లు లభించును. సంప్రదించండి: సెల్: 9949304722, 9866634088. [W-785493]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

- మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-785498]

ICE CREAMS

- Igloo Ice Cream Adalath HNK. వివాహ శుభ కార్యములకు ఐస్‌క్రీమ్ సప్లయి చేయబడును. సంప్ర॥ పాలం వేణుగోపాల్ రెడ్డి. 9849165892 PRR. 98493375236. [WA-6958]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

LOANS

- సిరి అసోసియేట్స్: హౌస్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785495]

WANTED

- కేవలం కూర్చొని లక్ష్మి పర్నీచర్ షాప్‌ని చూసుకోవడానికి Good Working Married/ Unmarried అమ్మాయి కావలెను. 10AM-7.30PM, WGL D-Mart ప్రక్కన WGL హాస్పిటల్ ఎదురుగా, కలువండి, ఇంటర్వ్యూ 01-05-23 [W-785497]
- వరంగల్ ఆటోనగర్‌లోని లక్ష్మిసాయి ఏజెన్సీస్ JK టైర్స్ C 1/2 లో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సంప్ర॥ 9866157044 [W-785529]
- GNM నర్సులు మరియు ఫార్మసిస్టులు కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. సమయం: 12pm to 2 pm. [WA-0229]
- హన్మకొండ పబ్లిక్‌గార్డెన్ దగ్గరలో HP పెట్రోల్‌బంక్ నందు పని చేయుటకు Male/ Female F.S.M.S, Cashiers కావలెను. సంప్ర: 9505919293. [W-1170543]
- హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000 - 15000. సంప్ర: 9703637320. [W-785494]
- వరంగల్ అండర్ బ్రిడ్జ్ దగ్గర గల గణేష్ ఆయిల్స్‌లో పనిచేయుటకు అనుభవం మరియు లైసెన్స్ కల్గిన ఆటో డ్రైవర్ కావలెను. సంప్ర॥ 9440171643. [WA-6949]
- విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1165937]
- ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000 + ఇన్సెంటివ్స్ ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684. [G-785891]
- Urgently Required RMC Marketing Managers, Senior Accountants, Senior Civil Engineers, Site Supervisor HNK. Drop a Resume in Whatsapp. Cont: 7095778886, 8555890439, 9849277408, [WA-12869]
- Need M/F Who Are Good At ENG Speaking, as PRI & HS Spoken ENG Trainers. Experience, not a must. Free Training by CFEL. Sal 20 - 30K. Ph : 8919641609 [H-781477]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793420]
- షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్ ఆయాలు, భార్యా భర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-10733]
- పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9059630792 [HA-6146]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి
కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.